# స్నేహలతాదేవి లేఖ

ప్రియమైన అమ్మనాన్నలకు !

నాకు పెండ్లి కావటంలేదని మీరు చాల చింత పెట్టుకున్నారు. మీ చింత చూసి మొదట్లో నాకూ చింతగానే వుండేది. నాకు పెండ్లి ఇక కాదా? - అని, నన్ను ఎవరూ మెచ్చడం లేదే - అని బాధపడ్డాను. ఏకాంతంలో ఏడ్చాను కూడా. పెళ్ళిచూపులకు వచ్చిన ప్రతి మగాడు నన్ను కాదనటంతో నాకు న్యూనతా భావం కూడా వచ్చేసింది. నాలో నాకే ఎన్నో లోపాలు కన్పించడం మొదలుపెట్టాయి. నాలో ధైర్యం లేకుండా పోయింది. ఏది చేయాలన్నా ఎక్కడికి వెళ్ళాలన్నా భయం! జంకు!

పెళ్ళిచూపుల మీద పెళ్ళిచూపులు జరిగాయి ఈ నాలుగేండ్లలో. ఎవరూ నన్ను మెచ్చకపోవడంతో నాకు పెళ్ళిచూపులంటేనే భయంగా మారింది. పెళ్ళిచూపులు అనే తతంగం ఆడదానికి జరిగే ఎన్నో అవమానాలల్లో అదొకటి అనిపించింది నాకు!

నిజానికి పెళ్ళిచూపులకు వచ్చినవాళ్ళల్లో ఎందరో నాకు నచ్చలేదు. కాని ఆ మాట చెప్పే హక్కు నాకు లేదని మీరూ సమాజం నేర్పారు నాకు. అందుకే నోరు మూసుకున్నాను. వచ్చిన ప్రతి పెళ్ళికొడుకు నన్ను కాదంటు వచ్చాడు. నేను నచ్చలేదని చెప్పి పంపారు. అయితే కొన్నాళ్ళకు నేను తెలుసుకున్నాను. పెళ్ళిచూపులకు వచ్చినవాళ్ళకు నేను కాదు నచ్చంది మీరిచ్చే కట్నం కానుకలని!

పెండ్లిచూపులకు వచ్చినవాళ్ళల్లో ఎంతోమంది అందంలో ఆకారంలో నాకు తగినట్లు గానే లేరు అయినా నేను బాగాలేనని నిరాకరించారు. కొందరికి ఉద్యోగాల్లేవు. మీరు డబ్బిస్తే ఉద్యోగం వస్తుందనే ధీమాతో వచ్చారు. కొంతమందికి ఉద్యోగమున్నా అంతంతమాత్రం చదువులే వాళ్ళయి. అయినా వాళ్ళల్లో ఒక్కరూ కూడా నాకు నచ్చలేదని చెప్పడానికి అవకాశం

లేదు. ఆడదానికి మగాడు నచ్చడం నచ్చకపోవడం అనేది ఈ భూమ్మీద లేనేలేని పదజాలం అని ఇన్నాళ్లూ అనుకున్నాను. అనుకునేట్లుగా నన్ను చేసారు. ఎందుకు? ఎందుకని?

నేనూ చదువుకున్నాను. ఉద్యోగం చేస్తే వచ్చేవాడు ఏమంటాడో అని నన్ను మీరు ఉద్యోగ ప్రయత్నం చేయొద్దన్నారు. నేను చూడడానికి మరీ అందంగా లేకున్నా వికారంగా మాత్రం లేనని నాకు తెలుసు! నేను మీకు ఒక్కతె కూతుర్ని. వేరే సంతానమేది లేదు. మీ దగ్గర బోలెడు డబ్బు లేకున్నా బట్టల దుకాణంలో పనిచేసే మీ సంపాదన కుటుంబం తిండికి బట్టకు లోటు లేకుండా సరిపోయింది. నన్ను మీ శక్తి కొద్ది కాలేజీ దాకా పంపించి చదివించారు. అంటే నేను శ్రద్ధతో కాలేజీదాకా చదువుకున్నాను. మీరు రిటైరుమెంటు తీసుకున్నాక ప్రావిడెంటుఫండు రూపంగా కొంత డబ్బు వచ్చింది. ఆ డబ్బును పోస్టాఫీసులో నెలనెల ఆదాయం పథకంలో పెట్టారు. ఆ డబ్బు మన ఖర్చులకు బొటాబొటీగా సరిపోతున్నది. మనకు తాతలనాటిది ఒక చిన్న ఇల్లు ఉంది. అద్దె కట్టే అవసరం లేదు. ఇదంతా పోగా మీరు పోగేసిన డబ్బు ఏ పెళ్ళికొడుక్కు నచ్చడంలేదు. మార్కెట్టులో రూపాయి విలువ పడి పోయిన కొద్ది దాని కనుగుణంగా కట్నం డబ్బు పెరిగిపోతున్నది. మీరు పోగేసిన డబ్బు విలువ ఏ పాటిదో తెలుసుకునే ఏ మగాడు నన్ను పెళ్ళి చేసుకోడానికి ముందుకు రావడంలేదు.

మీకు సాధ్యంకాని వాగ్దానాలు చేసి ఏదో విధంగా నా పెళ్ళి కావాలనేంత వరకు మీరు వెళ్ళడం నాకిష్టంలేదు. పెళ్ళి అంటే పరస్పర విశ్వాసం పరస్పర స్నేహంగా వుండాలి గాని ఒక్కరిదే పై చేయిగా వుండడం నేను హర్షించను.

ఇంతమంది పెళ్ళిచూపులకు వచ్చారుగద! ఒక్కరన్నా నా చదువు సంస్కారం గురించి అడిగారా? నన్ను చూడడం మొక్కుబడిగా చేసుకొని తర్వాత కట్నం కానుకల గురించి బేరాలాడడమే వాళ్ళకు సరిపోయింది. ఏమిటీ పెళ్ళిచూపుల అవమానం? ఆపైన బేరసారాలు? ఎందుకు సమాజం ఆచారాలు కట్టుబాట్లు ఆడదాన్ని బేరమాడే అంగట్లో వస్తువుగా చేసాయి! అమ్ముడుపోయేది వరుడు! అవమానాల పాలయ్యేది వధువు! ఇదేమి విడ్డూరం! నాకర్థం కావడంలేదు.

పెళ్ళిచూపులకు వచ్చినవాళ్ళల్లో ఒక్కరూ కూడా ఇస్తామన్న కట్నం కానుకలకు తృప్తిపడి నన్ను పెళ్ళి చేసుకుంటానని అనలేదు. ఎందుకు? - ఈ దేశంలో స్వయంశక్తి మీద విశ్వాసం లేనివాళ్ళే ఎక్కువయిపోతున్నారా? - పరాయిధనానికి ఆశ కాదు! - అత్యాశ పడేవాళ్ళే పెరిగి పోతున్నారా? ఇంకా ఈ దేశంలో మగాడు అనేవాడు వరకట్నం ఎంత ఎక్కువ వీలయితే అంత వసూలు చేసుకోవడం తన జన్మహక్కుగా భావిస్తున్నాడా? - అనే ఆలోచనలు కలిగి నన్ను కలవరించాయి. ఎన్నో ఆలోచనలతో రాత్రంతా గడిపాను.

చివరకు నా పెండ్లి కోసం వరకట్నం కోసం తాతలనాటి ఇల్లును అమ్ముదామను

కుంటుంటె నేను రాత్రి విన్నాను. అది నేను సహించలేకపోయాను. మీరు వెళ్ళిపోయింతర్వాత ఆ ఇల్లు నాకు వస్తుందని వచ్చే వరులకు తెలుసు. అయినా ఇప్పుడే వాళ్ళు తమకు రావలసింది రాబట్టుకోవాలని పట్టుబడ్తున్నారు. వరునికిచ్చే కట్నం కోసం ఈ విధంగా ఇల్లు అమ్మడం నాకిష్టం లేదు. మీరిద్దరూ వున్నంతకాలం ఇల్లు మీది! ఈ ఇంట్లో వుండడానికి మీకు హక్కు ఉంది. ఇల్లును అమ్మేసి మీరు చాలీచాలని డబ్బుతో నిత్య జీవితావసరాలకు కష్టంగా వుంటే డబ్బుపెట్టి అద్దెఇంట్లో మీరుండడం నాకు నచ్చలేదు. కాబట్టి నేను ఇంట్లో నుంచి వెళ్ళిపోతున్నాను. కానీ నేను చనిపోవడానికి వెళ్ళిపోవడంలేదు. నేను ఆత్మహత్య చేసుకునేంత పిరికిదాన్ని కాను! పలాయనవాదిని కాను!

మొగుడు కట్నం ఇంకా తెమ్మని బాధిస్తేనో అత్త ఆడబడుచులు వేధింపులకు గురయ్యో చదువుకున్న స్త్రీలు, ఉద్యోగాలుండి ఆర్థిక స్వాతంత్ర్యమున్న స్త్రీలు, తెలివితేటలున్న స్త్రీలు కిరోసిన్ పోసుకొని కాల్చుకొనో, ఫ్యాన్‌లకు ఉరిపెట్టుకొనో, హుసేన్‌సాగర్‌లో దూకో ఛస్తున్నారు. అట్లా స్త్రీలు చావును వరించడాన్ని నేను నిరసిస్తాను. ధైర్యంగా పరిస్థితులను జీవితాన్ని ఎదిరించాలంటాన్నేను. నిస్సహాయ పరిస్థితుల్లో చిక్కుకొన్నప్పుడు ధైర్యంగా వుండాలి గాని క్షణికమైన బలహీనతతో ఆడ, మగ ఎవరైనా సరే ఆత్మహత్య చేసుకోవడం నేను బలపరచను. అందుకని నేను ఆత్మహత్య చేసుకోవడానికి ఇంట్లోంచి వెళ్ళిపోవడం లేదు. నేను నా కాళ్ళ మీద నిలబడాలని పోతున్నాను.

వరకట్నం,. వరకట్నం చావులు ఎవరో కొంతమంది రోడ్ల మీద ప్రొసెషన్లు తీసి నినాదాలు చేసినంత మాత్రాన తీరవు. దానికోసం స్త్రీలల్లో ముందు పరిస్థితులనెదుర్కొనే ధైర్యం రావాలి. స్త్రీలు తమ వ్యక్తిత్వంతో సమాజం కట్టుబాట్లను నీతి నియమాలను మార్చాలి! ఆ ప్రయత్నంలో భాగంగా నా వంతుగా ఈ పని చేస్తున్నాను.

నాకు చదువు వుంది. డిగ్రీ వుంది. ఆ డిగ్రీతో ఏదైనా ఉద్యోగం చూసుకుంటాను. భవిష్యత్తులో నా జీవనపథంలో నన్నంటే ఇష్టపడేవాడు - వ్యక్తిగా నన్ను గౌరవించేవాడు డబ్బుకోసం కాక వరకట్నం కోసం కాక నా సాహచర్యం కోసం నా వ్యక్తిత్వం చూసి నన్ను పెళ్ళాడేవాడు దొరికినప్పుడే పెళ్ళి చేసుకుంటాను. కాబట్టి నేను ఇంట్లోంచి వెళ్ళిపోతున్నాని మీరేం విచారించవద్దు! ఒంటరిగా ఎక్కడికిపోతుంది ఎక్కడుంటుంది అని భయపడవద్దు! నన్ను నేను కాపాడుకోగలను. నాకా శక్తి వచ్చిందిప్పుడు! ఎక్కడున్నా నేను జాగ్రత్తగా క్షేమంగా వుంటానని మీకు హామీ ఇస్తున్నాను. నేను ఉద్యోగం సంపాదించుకోగానే మీకు వ్రాస్తాను. నేను ఎక్కడున్నది తెల్పుతాను. మిమ్మల్ని చూడడానికి వస్తాను. వీలయితే మీకిష్టమయితే మీరు వచ్చి నాదగ్గరే వుండవచ్చును. మీరు నా దగ్గర వుండడం ఇష్టపడేవాడు దొరికినప్పుడే నేను పెళ్ళి చేసుకుంటాను. కాబట్టి మీరు నా గురించి ఎటువంటి బెంగ పెట్టుకోవద్దు. ఎటువంటి ఆందోళన పడవద్దు.

ఇంకోమాట! - నాకు డిగ్రీ వుంది. ఉద్యోగం చేసుకుంటానన్న ధీమాతో వున్నానని అంటుందేమో లోకం - చదువులు డిగ్రీలు లేనివాళ్ళు కూడా వాళ్ళకు తగిన వృత్తిని- బట్టలు కుట్టడమో కూరగాయలమ్మడమో ఫ్యాక్టరీలల్లో ప్యాక్ చేయడమో ఎన్నో పనులుంటాయి. - అవి చేసుకుంటు తమ జీవితాన్ని తమకిష్టమైన రీతిలో మలచుకోవచ్చును. కాబట్టి నా తోటి సోదరీమణులకు నేనిచ్చే సలహా సందేశమేమిటంటే నిస్సహాయ పరిస్థితుల్లో మానసిక ఒత్తిడితో ధైర్యం కోల్పోయి చేయగూడని పని చేయవద్దు! ప్రాణాలనే తీసుకోవద్దు! అవకాశాలు లేవని అణచివేతలో ఏమీ చేయలేమని మీరు అనుకోవద్దు. ఏదైనా సాధించి చూపించండి. ధైర్యంగా ఎదురు నిలిచి నిలబడండి.

అమ్మా! నాన్న!

నా ధ్యేయం ఫలించాలని నాకు అన్ని విధాలా విజయం లభించాలని ఆశీర్వదించండి.

ఇట్లు
మీ కూతురు
స్నేహలత

* * *